క్లుప్తంగా

భ్రమరాంబాదేవికి ఊయలసేవ


స్వామి అమ్మ వార్లకు ఊయల సేవ నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలంటెంపుల్: అష్టా దశ శక్తిపీఠంగా వెలసిన శ్రీశైల భ్రమరాంబాదేవికి శుక్రవారం అమ్మవారి మూల నక్షత్రాన్ని పురస్కరించుకుని దేవస్థాన అర్చకులు శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. సాయంత్రం 7గంటలకు సేవా సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ చేశారు. ఊయలలో స్వామిఅమ్మవార్లను ఆశీనులను చేసి షోడశోపచార పూజల అనంతరం అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామ పూజలు జరిపించారు. అనంతరం శ్రీశైలం లోనీ అంకాలమ్మ దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఉపాధి పనుల తనిఖీ


కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

పాములపాడు: మండలంలోని తుమ్మలూరు, జూటూరు గ్రామాల పరిధిలో జరుగుతున్న ఉపాధి పనులను శుక్రవారం ఎంపీడీఓ చంద్రశేఖర్ తనిఖీ చేశారు. ఉపాధి పనుల్లో భాగంగా ఫాంపాండ్స్‌లను తవ్వించుకోవాలని ఆయన రైతులకు సూచించారు. ఫాంపాండ్స్‌తో భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. ఆయన వెంట ఏపీఓ విమలమ్మ, జేఈ రమేష్ నాయుడు ఉన్నారు.

ఆది దంపతుల విహారం


మహానందిలో పల్లకీసేవ దృశ్యం

మహానంది: మహానందిలో శుక్రవారం రాత్రి పల్లకిసేవ వైభవంగా జరిగింది. ఈఓ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర్ అవధాని, నాగేశ్వర శర్మ, హనుమంత శర్మ, అర్చకులు ముందుగా శ్రీ కామేశ్వరీ, మహానందీశ్వర ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. అలంకార మండపంలో గణపతి పూజ, అలంకార పూజలు చేసి స్వామి, అమ్మవార్లను పల్లకిలో కొలువు చేశారు. ఆలయ ప్రాకారాల్లో స్వామివార్ల ఉత్సవం వైభవంగా జరిగింది. పలు ప్రాంతాలకు చెందిన వేలాది భక్తులు పల్లకీ ఉత్సవంలో పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు


సంప్రదాయ నృత్య ప్రదర్శనలో కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నందికొట్కూరుకు చెందిన సాయి నృత్య కళాశాల వారి సంప్రదాయ నృత్య ప్రదర్శన అలరించింది. కార్యక్రమంలో మహాగణపతిం, నమో నమో నటరాజ, అయిగిరినందిని, శివతాండవం తదితర గీతాలకు ఎం.అమతవర్షిణి, ఎస్.అక్షయ్య, కె.వెంకటపూజిత, డి.సాయిలక్ష్మి, ఎన్.వరలక్ష్మి, జె.రామతులసి, బి.సర్వజ్ఞ తదితరులు నృత్యప్రదర్శనలు చేశారు.

సర్వే పూర్తి చేయాలి


ఇంటింటి సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పాములపాడు: కుటుంబ సభ్యుల వివరాల సేకరణ సర్వే త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ సిబ్బందికి సూచించారు. శుక్రవారం తుమ్మలూరు, జూటూరు గ్రామాల్లో ఇంటింటి సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పలు గృహాలను సందర్శిస్తూ సర్వేను పరిశీలించారు. ఇంటి వద్దకు వచ్చే సర్వే సిబ్బందికి సహకరించాలని ప్రజలకు సూచించారు.

స్త్రీనిధి రుణాలు సకాలంలో చెల్లించాలి

బండి ఆత్మకూరు: స్త్రీనిధి రుణాలు తీసుకున్న మహిళలు సకాలంలో చెల్లించాలని జిల్లా స్త్రీనిధి ఏరియా జనరల్ మేనేజర్ నాగప్రసాద్ సూచించారు. శుక్రవారం ఆయన స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయాన్ని సందర్శించారు. మహిళా సమాఖ్య కార్యకలాపాలను, స్వయం సహాయ సమూహాల అభివృద్ధిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ పొదుపు మహిళలు తమ అవసరాల కోసం 365 రోజుల్లో ఎప్పుడైనా స్త్రీ నిధి రుణాలను 11 శాతం వడ్డీతో రూ.5 లక్షల వరకు పొందవచ్చన్నారు. గ్రూపులో కనీసం ఇద్దరు మెంబర్లు ఉన్నా స్త్రీ నిధి రుణాలు తీసుకోవచ్చన్నారు. ఆయన వెంట ఏపీఎం రామశేఖర్ రెడ్డి ఉన్నారు.

చిత్త‘శుద్ధి’ ఏదీ?

ఆత్మకూరు పట్టణ వాసులకు మంచి నీరు దొరకడం గగనమైపోయింది. ఒక పక్క కలుషితమవుతున్న మున్సిపల్ వాటర్‌ను తాగలేక.. మరో పక్క క్లోరినేషన్(శుద్ధి) కాని వాటర్ ప్లాంట్ల నుంచి తెచ్చుకున్న నీటిని తాగలేక రోగాల బారిన పడుతున్నారు. ఆర్థిక స్తోమత అంతంత మాత్రమే ఉన్న పేద, మధ్య తరగతి ప్రజలు మాత్రం చేసేదేమీలేక మున్సిపల్ కుళాయిల నీటితోనే తప్పని పరిస్థితుల్లో దాహం తీర్చుకుంటున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో మున్సిపల్ సిబ్బంది ట్యాంకుల శుభ్రతను గాలికొదలగా.. ధనార్జనపై ఉన్నంత చిత్తశుద్ధి మినరల్ వాటర్ ప్లాంట్లపై నిర్వాహకులు చూపడం లేదు.

- ఆత్మకూరులో పుట్టగొడుగుల్లా వాటర్ ప్లాంట్లు
- ప్రమాణాలకు నిర్వాహకులు పాతర
- వ్యాధుల బారిన పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



ఆత్మకూరు: పట్టణంలో మినరల్ వాటర్ ప్లాంట్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. బోరు నీటిని శుద్ధి చేయకుండా, ఎలాంటి ప్రమాణాలు పాటించకుండా ధనార్జనే పరమావధిగా నిర్వాకులు వాటర్ ప్లాంట్లను నడుపుతున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఆ నీటినే తాగుతున్న పట్టణ వాసులు వ్యాధుల బారిన పడుతున్నారు. మినరల్ వాటర్ కొనుగోలు చేసే శక్తి లేని పేద మధ్య తరగతి ప్రజలు మున్సిపల్ కుళాయిల నీటితో కాలం గడుపుతున్నారు. అయితే మున్సిపల్ సిబ్బంది కూడా వాటర్ ట్యాంకులను శుభ్రం చేయకపోవడం, కుళాయిల పైప్‌లైన్ ఏళ్ల క్రితం ఏర్పాటు చేసింది కావడం వల్ల నీరు కలుషితమై ఇటీవల ముగ్గురు మృత్యువాత పడ్డారు. మరికొందరు ఆస్పత్రి పాలయ్యారు. ఇందుకు కలుషితనీరే కారణమని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నప్పటికీ అధికారులు మాత్రం కొట్టిపడేస్తున్నారు. మినరల్ వాటర్ ప్లాంట్ల నీటిని తాగడం వల్లేనంటూ ఓ ప్లాంట్‌ను సైతం సీజ్ చేసి చేతులు దులుపుకున్నారు.

అనధికార ప్లాంట్లే అధికం..

ఆత్మకూరు పట్టణంలో 31 మినరల్ వాటర్ ప్లాంట్లు ఉన్నాయచి. వీటిలో ఏ ఒక్క ప్లాంట్‌కూ ఐఎస్ఐ మార్కు లేదు. 13 ప్లాంట్ల నిర్వాహకులు మాత్రం ప్రజల దాహం తీరుస్తామంటూ ఆథరైజ్డ్‌గా మున్సిపాలిటీ నుంచి లైసెన్సు మాత్రమే పొందారు. మిగతా ప్లాంట్‌లకు ఎలాంటి మున్సిపాలిటీ నుంచి ఆథరైజ్డ్ పొందకపోగా మినరల్ వాటర్ పేరుతో ప్రజలకు నేరుగా బోరు నీటినే సరఫరా చేస్తున్నారు. ప్రతిరోజూ పట్టణంలో దాదాపు 20 వేల లీటర్లకు పైగా నీటిని అందిస్తున్నారు. వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, హోటళ్లు, దుకాణాలు, వివాహాలు, శుభకార్యాలకు ఈ నీటిని మినరల్ వాటర్ పేరుతో అందిస్తూ నిర్వాహకులు సొమ్ము చేసుకుంటున్నారు.

శాంపిల్స్ ల్యాబ్‌కు పంపాం



అతిసారా వ్యాధి ప్రబలి ఇటీవల ముగ్గురు మృతిచెందారు. మా సిబ్బందితో మినరల్ వాటర్ ప్లాంట్ల శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపించాం. రక్షిత తాగునీటి ట్యాంక్ శుభ్రం చేయించి కొత్త పైప్‌లైన్ వే యించాం. యథావిధిగా తాగునీటిని సరఫరా చేస్తాం.
– రమేష్‌బాబు, ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్

ప్లాంట్లపై కన్నెత్తి చూడని అధికారులు

కుప్పలు తెప్పలుగా ఉన్న, ఎలాంటి మున్సిపాలిటీ ఆథరైజ్డ్ లేని మినరల్ వాటర్ ప్లాంట్ల వైపు అధికారులు కన్నెత్తి కూడా చూడకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. వాస్తవానికి మినరల్ వాటర్ ప్లాంట్‌లను మున్సిపల్ అధికారులతో పాటు తహసీల్దార్, ఆర్‌డీఓ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తనిఖీలు చేయాల్సి ఉంటుంది. ఈ ప్లాంట్‌లను తనిఖీ చేసే సమయంలో వారు ఇప్పటికే నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఏదైనా ఘటన జరిగినప్పుడు హడావుడు చేయడం తప్ప మిగతా సమయాల్లో ఎలాంటి తనిఖీలు చేయకపోవడంతో వాటర్ ప్లాంట్ల నిర్వాహకులు ఆడిందే ఆట పాడిందే పాటలా తయారైంది. ఇటీవల అతిసార వ్యాధితో పట్టణానికి చెందిన ముగ్గురు మృత్యువాత పడ్డారు. అందుకు కారణం ప్రమాణాలు పాటిచని మినరల్ వాటర్ ప్లాంట్లా? ట్యాంకులు శుభ్రం చేయని మున్సిపల్ అధికారులా అనేది ప్రజలకు అంతుచిక్కని ప్రశ్నగా మిగిలింది.

బాలిక అదృశ్యం

బండి ఆత్మకూరు: మండల పరిధిలోని జీసీ పాలెం నెమళ్లకుంట చెంచు గూడెంలో 15 ఏళ్ల బాలిక అదృశ్యమైనట్లు శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ జగన్‌మోహన్ తెలిపిన వివరాలు.. ఈ నెల 3న రాత్రి బాలిక ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. తెలిసిన చోటల్లా వెతికినా ఆచూకీ లేకపోవడంతో కుటుంబ సభ్యులు శుక్రవారం పోలీసులను ఆశ్రయించారు. బాలిక సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

డిగ్రీ కళాశాలలో వెబ్‌నార్

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శ్రీనివాస్ అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం వెబ్‌నార్ నిర్వహించారు.

వృక్షశాస్త్రం, మహిళా సాధికారికత విభాగం సంయుక్తంగా నిర్వహించిన వెబ్‌నార్‌లో విద్యార్థులకు యాక్సిలరేటింగ్ యాక్షన్, సస్టైనబులిటీపై ప్రాజెక్టు రిసోర్స్ పర్సన్ గ్రీన్ వయోస్ సొల్యూషన్స్ ఏ.ఆర్.నహిద్‌షేక్ అవగాహన కల్పించారు. మహిళా సాధికారికత విభాగం కో–ఆర్డినేటర్ తిరుపతమ్మ, వృక్ష శాస్త్ర అధ్యాపకురాలు బి.పద్మావతిబాయి, విద్యార్థినులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం వడ్డించాలి

కొత్తపల్లి: విద్యార్థులకు ప్రభుత్వం అందించే మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం వడ్డించాలని సర్వశిక్షా అభియాన్ జిల్లా అడిషనల్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ ప్రేమంత్ కుమార్, అకాడమిక్ మానిటరింగ్ అధికారి లలితా కుమారి సూచించారు. శుక్రవారం స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులు, తరగతి గదులు, పరిసరాలు, వంటశాల, నూతన గదుల నిర్మాణం, మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. నిర్వాహకులు వంటశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నాణ్యమైన, రుచికరమైన కూరగాయలు, ఆకు కూరలు వడ్డించాలని సూచించారు. వీరి వెంట ఎంఈఓలు ఇనాయతుల్లా, బాలాజీ నాయక్, ప్రిన్సిపాల్ కృష్ణాబాయి పాల్గొన్నారు.


భోజనాన్ని రుచి చూస్తున్న ఏపీసీ హేమంత్ కుమార్

- **ఆత్మకూరు:** శ్రీశైలం, నందికొట్కూరు నియోజకవర్గాల పాఠశాలల రివ్యూ మీటింగ్‌ను ఆత్మకూరులో శుక్రవారం నిర్వహించారు. అడిషనల్ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ పి.హేమంత్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. ఇంతవరకు పాఠశాలల్లో ఏయే పనులు చేపట్టారు, ఎంతవరకు పూర్తయ్యాయని ఆరా తీశారు. సమన్వయంతో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో నోడల్ ఆఫీసర్ లలితకుమారి, సెక్టోరియల్ ఆఫీసర్లు రఘురామిరెడ్డి, రామ్మోహన్, ఎంఈఓలు బాలాజీనాయక్, సురేష్, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాల తనిఖీ

కొత్తపల్లి: స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, గోకవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేయనున్న పదో తరగతి పరీక్షా కేంద్రాలను శుక్రవారం ఎంఈఓ–2 ఇనాయతుల్లా పరిశీలించారు. విద్యార్థులకు తాగునీరు, లైటింగ్, మూత్రశాలలు, డెస్కులు ఉన్నాయా లేదా అని ఆరా తీశారు. ఈనెల 17 నుంచి నిర్వహించే పది పరీక్షలకు విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

ఇంటర్ పరీక్షలకు ముగ్గురు గైర్హాజరు

మిడుతూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ (ద్వితీయ సంవత్సరం)పరీక్షా కేంద్రాన్ని శుక్రవారం ఫ్లయింగ్ స్క్వాడ్ శ్రీనివాసరెడ్డి తనిఖీ చేశారు. 110 విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా ముగ్గురు విద్యార్థులు గైర్హాజరైనట్లు పరీక్షల నిర్వహణ అధికారి ఎల్లన్న తెలిపారు.

12న ఉపాధి కూలీల ధర్నా

కొత్తపల్లి: ఉపాధి కూలీల డిమాండ్లు నెరవేర్చుకునేందుకు ఈనెల 12 న విజయవాడదలో మహా ధర్నా నిర్వహించనున్నట్లు ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎన్ స్వాములు, మండల అధ్యక్షుడు నరేష్ తెలిపారు. శుక్రవారం పాత మాడుగుల గ్రామం సమీపంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలతో మాట్లాడారు. ధర్నాకు తరలిరావాలని కోరారు.

ముగిసిన ధార్మిక కార్యక్రమాలు

పగిడ్యాల: తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో మండలంలోని లక్ష్మాపురం వీరాంజనేయస్వామి ఆలయం వద్ద ఈనెల 4 నుంచి నిర్వహిస్తున్న ధార్మిక కార్యక్రమాలు శుక్రవారంతో ముగిసినట్లు ఉమ్మడి కర్నూలు జిల్లా కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి తెలిపారు. ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తరాలు మారినా, యుగాలు మారినా శ్రీమద్రామాయణం భారతీయ సంస్కృతికి ప్రతిరూపంగా ఉందన్నారు. హిందూ ధర్మం పట్ల భావితరాలకు అవగాహన కలిగించేందుకు ఊరూరా తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. అనంతరం కుంకుమ పూజ, గో పూజ కార్యక్రమాలను చేపట్టి భక్తిభావాన్ని విస్తృతింప జేశారు. భానోజీరావు భజన బృందంతో ప్రతి రోజు భజన కార్యక్రమాలు చేపట్టారు.


ప్రవచనాలు వివరిస్తున్న డాక్టర్ మల్లు వెంకటరెడ్డి

తాగునీటి సమస్య తలెత్తనివ్వొద్దు

- జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి

నందికొట్కూరు: వేసవి కాలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి ఆదేశించారు. శుక్రవారం పట్టణ సమీపంలోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జెడ్పీ సీఈఓ మాట్లాడుతూ వేసవి కాలంలో ముందస్తుగా సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను నింపాలన్నారు. ప్రజలకు తాగునీటి సమస్యలు రాకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎక్కడ నీటి సమస్య వస్తే ఆ ఏరియాకు సంబంధించిన అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయం పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, ఈఓఆర్డీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, పీఎస్‌లు ఉన్నారు.


సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి

కురువల మధ్య స్థల వివాదం

- పోలీసులను ఆశ్రయించిన ఇరువర్గాలు

పగిడ్యాల: మండలంలోని పడమర ప్రాతకోట గ్రామంలో 1980లో కురువ కుల సంఘానికి కేటాయించిన స్థలంపై వివాదం రాజుకుంటోంది. ఆ స్థలం చుట్టూ ప్రహరీ నిర్మిస్తుండగా మల్లమ్మ కుటుంబ సభ్యులు శుక్రవారం అడ్డుకున్నారు. తమ ఇంటి పక్కనే బీరప్ప గుడి ఎలా నిర్మిస్తారని వాదోపవాదాలకు దిగారు. ప్రతి కులానికి ప్రభుత్వం కమ్యూనిటీ అవసరాల కోసం స్థలాలు కేటాయించారని, కురువ సంఘానికి కేటాయించిన ఈ స్థలంలో పశువులు, జీవాలు నిలిపి అపరిశుభ్రంగా చేయడంతో పాటు స్థలం కబ్జాకు గురవుతుందని, స్థలం చుట్టూ ప్రహరీ నిర్మిస్తున్నామని కుల సంఘ నాయకులు పేర్కొన్నారు. దీంతో ఆగ్రహానికి గురైన మల్లమ్మ కుటుంబీకులు కుల పెద్దలతో ఘర్షణకు దిగారు. ఇరువర్గాల మధ్య సయోధ్య కుదరకపోవడంతో ముచ్చుమర్రి పోలీసుస్టేషన్‌ను ఆశ్రయించారు. గత వారం ఈ స్థలానికి సంబంధించి అనుబంధ పత్రం ఇవ్వాలని తహసీల్దార్ శివరాముడును ఎమ్మెల్యే గిత్తా జయసూర్య ఆదేశించిన విషయం విధితమే.

నకిలీ మందులు విక్రయిస్తే చర్యలు తప్పవు

నందికొట్కూరు: నకిలీ మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని డోన్ ఏడీఏ ఆర్.అశోక్‌వర్ధన్ రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని ఫర్టిలైజర్స్, ఫెస్టిసైడ్స్ సింహాద్రి ఫర్టిలైజర్, శ్రీలక్ష్మీవెంకటేశ్వర ఫర్టిలైజర్, ఫెస్టిసైడ్స్, న్యూ సుధాకర్ రెడ్డి ఫర్టిలైజ్, ఫెస్టిసైడ్స్ దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. స్టాక్ రికార్డులను పరిశీలించగా అందులో జీ2, జీ3 లేటెస్ట్ చూపించకపోవడంతో తాత్కాలికంగా అమ్మకాలను నిలిపివేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుకాణాల్లో ఎలాంటి తేడాలు వచ్చినా చర్యలు తీసుకుంటామన్నారు.


మందుల దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏడీఏ ఆర్ అశోక్‌వర్ధన్ రెడ్డి

సంక్షిప్తం

ధర్నాకు తరలిరండి

ఆత్మకూరు: ఉపాధి కూలీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 12వ తేదీన విజయవాడలో చేపట్టనున్న ధర్నాకు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని ఏపీ రైతుసంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు మాబాషా, వీరన్న, సీఐటీయూ కార్యదర్శి రామ్‌నాయక్ కోరారు. శుక్రవారం కురుకుంద గ్రామంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

సమస్యల పరిష్కారానికి ఉద్యమిద్దాం

కొత్తపల్లి: శ్మశానాల్లో గుంతలు తీసి జీవనం సాగిస్తున్న బేగరీల సమస్యల పరిష్కారం కోసం కలిసి ఉద్యమించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి జిల్లా నాయకుడు ఎస్.సంపత్, కాటికాపర్లు, గుంతలు తీసే బేగరీల సంఘం మండల కార్యదర్శి పి.శేఖర్ కోరారు. కేవీపీఎస్ ఆధ్వర్యంలో ఈనెల 11న విజయవాడలో జరిగే ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని శుక్రవారం సింగరాజుపల్లె, శివపురం, ముసలిమడుగు, దుద్యాల గ్రామాల్లో కరపత్రాల ద్వారా ప్రచారం నిర్వహించారు.

దరఖాస్తు గడువు పెంపు

పగిడ్యాల: మండల పరిధిలోని లక్ష్మాపురం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో 5వ తరగతి, ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ప్రవేశం కోసం దరఖాస్తు గడువును ఈనెల 13వ తేదీ వరకు పొడగించినట్లు ప్రిన్సిపాల్ రమణమ్మ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

యువరైతు ఆత్మహత్యాయత్నం

మిడుతూరు: మండల పరిధిలోని ఖాజీపేట గ్రామానికి చెందిన కొలు మధుకిరణ్ అశోక్ (35) పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. మధుకిరణ్ అశోక్ పదేళ్లుగా పొలాన్ని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. పెట్టుబడుల నిమిత్తం దాదాపు రూ.15 లక్షల అప్పు చేశాడు. పంటలు సరిగా చేతికి రాకపోవడంతో అప్పు తీర్చే మార్గం లేక శుక్రవారం గని గ్రామాలకు వెళ్లే దారిలోని ఎల్లాగు సమీపంలో పురుగు మందు తాగి, విషయాన్ని ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు చేరవేశాడు. వారు అక్కడికి చేరుకుని స్థానిక ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం అంబులెన్స్‌లో కర్నూలుకు తరలించారు. ఈ విషయంపై ఎస్ఐ ఓబులేసును వివరణ కోరగా తమ దృష్టికి రాలేదన్నారు.

ఆయకట్టు రైతులకు అన్యాయం చేయొద్దు

- అధికారులకు విన్నవించిన వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామ పెద్దలు

జూపాడుబంగ్లా: కేసీ ఆయకట్టు కింద సాగుచేసిన రబీ పంటలకు సాగునీరివ్వకుండా తూములను మూసివేసి రైతులకు అన్యాయం చేయొద్దని వైఎస్సార్‌సీపీ నాయకుడు, జెడ్పీటీసీ సభ్యుడు పోచా జగదీశ్వరరెడ్డి, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కేశవరెడ్డి నాగార్జునరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కోసిక తిరుమలేశ్వరరెడ్డి, గ్రామపెద్దలు, రైతులు అధికారులకు విన్నవించారు. ఎస్ఈ ద్వారకానాథ్, డిప్యూటీ ఎస్ఈ బాలచంద్రారెడ్డి, ఈఈ ఎస్.ప్రసాదరావు, డీఈ ప్రసాదరావు, ఏఈలు శ్రీనివాసనాయక్, నరేష్, భరత్‌కుమార్, లష్కర్లు శుక్రవారం కేసీ కెనాల్ వెంట పర్యటించారు. కేసీ కాల్వ ఆయకట్టుకు సాగునీరు ఇవ్వకుండా తూములను మూసివేసి దిగువకు నీటిని ఎలా తరలిస్తారంటూ తాటిపాడు, భాస్కరాపురం, ప్రాతకోట, పాములపాడు, 80బన్నూరు, జూపాడుబంగ్లా తదితర గ్రామాలకు చెందిన రైతులు ఆందోళనకు దిగారు. వారికి నచ్చజెప్పి దిగువనున్న ఆయకట్టుకు మళ్లించేందుకు అధికారులు విఫలయత్నం చేశారు. మరో నెలరోజుల్లో రబీ పంటలు చేతికందే దశలో తూములను మూసివేస్తే రైతులు తీవ్రంగా నష్టపోతాని ఈ సందర్భంగా నాయకులు అధికారుల దృష్టికి తెచ్చారు. మరోవైపు మూసిన తూములను తెరిచి కాల్వలకు నీటిని మళ్లించుకునేందుకు రైతులు యత్నించటంతో కొంత ఉద్రిక్తత నెలకొంది. నాయకులు, గ్రామపెద్దలు నచ్చజెప్పటంతో రైతులు శాంతించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు జక్కిరెడ్డిగారి శంకరరెడ్డి, రాయపు పెద్దరంగారెడ్డి, సాగునీటి సలహా సంఘం జిల్లా చైర్మన్ పరమేశ్వరరెడ్డి, అంబిరెడ్డి పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న గ్రామ పెద్దలు, వైఎస్సార్‌సీపీ నాయకులు

మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు


కేక్ కట్ చేస్తున్న ఆర్డీఓ నాగజ్యోతి


నందికొట్కూర్‌లో మహిళలను సన్మానిస్తున్న ఎంఈఓలు

ఆత్మకూరు: మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారని ఆర్డీఓ నాగజ్యోతి అన్నారు. స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి ఉద్యోగులకు, సిబ్బందికి పంచిపెట్టారు. కార్యక్రమంలో ఆత్మకూరు సీఐ రాము, ఆర్డీఓ కార్యాలయ ఏఓ శ్రీనివాసులు, జేఏసీ అమరావతి మహిళా ఉద్యోగులు, నాయకురాలు జేఏసీ అధ్యక్షులు, వైస్ ప్రెసిడెంట్ ఏపీఓ విమల, విజయకుమారి, మల్లేశ్వరి పాల్గొన్నారు.

వెలుగోడులో..

వెలుగోడు: స్థానిక వ్యవసాయ అధికారి కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం వ్యవసాయ మహిళా సిబ్బందిని మండల వ్యవసాయ అధికారి పవన్‌కుమార్ ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో ఏఈఓలు సుధారాణి, అంజిత్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

ఎంపీపీ కోట హైస్కూల్‌లో..

నందికొట్కూరు: పట్టణంలోని ఎంపీపీ కోట హైస్కూల్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయురాళ్లకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు ఎంఈఓ సుభాన్ బహుమతులు అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఈఓలు రంగారెడ్డి, ఆంజనేయులు, అధ్యాపకులు వెంకటేశ్వరరావు, బహుమతి దాత గౌరీశ్వర నాయుడు పాల్గొన్నారు.

పాములపాడులో..

పాములపాడు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేశారు. తహసీల్దార్ సుభద్రమ్మ మాట్లాడుతూ విద్యతోనే వికాసం అని, ప్రతి ఒక్కరూ అమ్మాయిలను మంచిగా చదివించాలని సూచించారు. మహిళల పట్ల ఎక్కడా కూడా వివక్షత చూపకుండా ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పఠాన్‌బాబు, రీ సర్వే డీటీ సుప్రియ, ఆర్ఐ ఖాజాబీ, వీఆర్వోలు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లాలో..

జూపాడుబంగ్లా: స్థానిక వెలుగు కార్యాలయంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో డాక్టర్ సభా, ఏపీఎం అంబమ్మ, ఏపీఓ గౌరీబాయి, హౌసింగ్ ఏఈ జ్యోతి, సీనియర్ అసిస్టెంట్ సరళ, హెల్త్‌సూపర్‌వైజర్ విజయలక్ష్మమ్మ పాల్గొని కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.


మహిళా సిబ్బందిని సన్మానించిన ఏఓ పవన్ కుమార్


కేక్ కట్ చేస్తున్న తహసీల్దార్, మహిళా ఉద్యోగులు

ప్రతి స్త్రీని మాతృమూర్తిగా భావిస్తాం


దర్శనార్థం వస్తున్న పీఠాధిపతి కైలాస ఆనందగిరి స్వామి

మహానంది: ప్రతి స్త్రీలోనూ మాతృమూర్తిగా భావిస్తామని పెనుగొండ కైలాస ఆశ్రమం పీఠాధిపతి కైలాస ఆనందగిరి స్వామి పేర్కొన్నారు. మహానందీశ్వరుడి దర్శనార్థం శిష్యబృందంతో కలిసి శుక్రవారం మహానందికి వచ్చారు. ఆలయ సూపరింటెండెంట్ అంబటి శశిధర్‌రెడ్డి, ఆలయ ఇన్‌స్పెక్టర్ శ్రీశైలం శ్రీనివాసులు(చిన్నా) స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పీఠాధిపతి కైలాస ఆనందగిరి స్వామి కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని పూజలు చేపట్టారు. తర్వాత వారికి ఆలయ అధికారులు, అర్చకులు స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించారు.